# కాసిపేటకు తాగునీరు బంద్

- బెల్లంపల్లిలో పగిలిన పైపు
- రెండ్రోజులుగా తాగునీటికి తండ్లాట

**బెల్లంపల్లి:** మున్సిపల్ అధికారుల తొందరపాటు చర్యలతో కాసిపేట మండల వాసులకు తాగునీటి సరఫరా నిలిచి పోయింది. గడిచిన రెండు రోజుల నుంచి మిషన్ భగీరథ పథకం నీళ్ల నిలిచిపోవడంతో కాసిపేట వాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులను మున్సిపల్ అధికారులు కలిపించారనే విమర్శలు వస్తున్నాయి. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య పర్యవేక్షణలో గడిచిన కొద్ది రోజుల నుంచి జేసీబీ ఇతర యంత్రాలతో రోడ్డు పక్కన ఉన్న మట్టిని తొలగించే చర్యలు చేపట్టారు. అదే తీరుగా ప్రధాన రహదారి, మున్సిపల్ వార్డుల్లోనూ మట్టి పనులు సాగుతున్నాయి. కాల్‌టెక్స్ ఏరియాలోని మురికి నీటి కాలువలో పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. ఆ పక్కనే బెల్లంపల్లి నుంచి కాసిపేటకు వెళ్లే మిషన్ భగీరథ పథకం అంతర్గత పైపులైన్ ఉంది. ఆ పైపు ద్వారా కాసిపేట మండల వాసులకు నీటి సరఫరా జరుగుతుండగా మట్టి తీత పనులు జేసీబీతో చేయిస్తుండగా పైపులైన్ పగిలింది. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీరు సరఫరా జరగక ఆ మండల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అదే తీరుగా బెల్లంపల్లి మున్సిపాలిటీలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశాలు ఉండడంతో వెంటనే అప్రమత్తమై మరో మార్గం ద్వారా నీటి సరఫరా చేస్తుండడంతో పుర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

**కొనసాగుతున్న మరమ్మతులు..**

కాల్‌టెక్స్ ఏరియా ఫారెస్టు క్వార్టర్స్ ప్రాంతంలో పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. నీటి సరఫరా ఆగి పోయి గ్రామీణులు ఇబ్బందులు పడుతుండడంతో పగిలిపోయిన పైపులను తొలగించి వాటి స్థానంలో కొత్త పైప్‌లైన్‌లను బిగించే చర్యలకు ఉపక్రమించారు. మున్సిపల్, మిషన్ భగీరథ పథకం సిబ్బంది యంత్రాల సాయంతో పైపులైన్ పునఃరుద్ధరణ పనులను నిర్వహిస్తున్నారు. ఆ పనులకు దాదాపు పూర్తి కావచ్చాయి. ఒకటి, రెండు రోజుల్లో నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు.

**పైపులకు పొంచి ఉన్న ప్రమాదం...**

మున్సిపాలిటీలో ప్రధాన రహదారి వెంట, వార్డుల్లో మట్టి కుప్పలను తొలగిస్తున్నారు. జేసీబీతో మట్టి పనులు చేపడుతుండటంతో ఒక్కో చోట అంతర్గతంగా ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం పైపులు స్వల్పంగా దెబ్బతింటున్నట్లు తెలుస్తోంది. వాటికి వెంటనే మరమ్మతులు చేస్తుండటంతో నీటి సరఫరాకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడకపోయిన పైపులు మాత్రం ధ్వంసం అవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. మట్టి తొలగింపు పనులు చేపట్టడానికి చూపిస్తున్న అత్యుత్సాహంతో పైపులకు ప్రమాదం పొంచి ఉందని పురప్రజలు పేర్కొంటున్నారు. అత్యంత జాగ్రత్తగా మట్టి పనులు నిర్వహించేలా చర్యలు తీసుకుని పైపులు దెబ్బ తినకుండా చూడాలని, నీటి కటకట ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాగా కాసిపేట మండల వాసులకు నీటి సరఫరా కోసం సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు బెల్లంపల్లి మిషన్ భగీరథ పథకం ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు.



జేసీబీ సాయంతో పైపును తీసుకెళ్తున్న సిబ్బంది

# కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం

**కాసిపేట:** కాంగ్రెస్ పాలనలో పేదలకు అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ తెలిపారు. మండలంలో ప్రారంభించిన నియోజకవర్గ పాదయాత్ర, పల్లెపల్లెకు కాంగ్రెస్ గురువారం 5వ రోజు కోమటిచేను, రేగులగూడ, చిన్న ధర్మారం, పెద్దధర్మారం, ముత్యంపల్లిలో నిర్వహించి కాసిపేటలో బస చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ పథకం పెట్టిన కొందరికి మాత్రమే దక్కుతుందని, కాంగ్రెస్ హయాంలో పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇతర పథకాలు అర్హులందరికీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కార్యదర్శి రొడ్డ శారద, నాతరి స్వామి, బెల్లంపల్లి మండల నాయకులు రొడ్డ శ్యాం, మండల మాజీ అధ్యక్షుడు సిద్దం తిరుపతి, మాజీ సర్పంచ్ జాడి శంకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటిస్వామి, కనుకుల రాకేష్, కనకరాజు ఉన్నారు.



పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు

## ఏఎన్ఎంల సమ్మెకు మద్దతు

**మంచిర్యాలటౌన్:** జిల్లాలో పనిచేస్తున్న కాంట్రాక్టు సెకండ్ ఏఎన్ఎంలు తమను రెగ్యులరైజ్ చేయాలని, నూతన ఏఎన్ఎంల నియామకం కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో చేస్తున్న సమ్మెకు గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎన్ఎంల మెడికల్ బోర్డు ద్వారా జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి, 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం, హెచ్ఆర్ఏ ఇవ్వాలని, పెండింగ్ ఏరియర్స్‌ని విడుదల చేయాలని కోరారు. 180 రోజుల వేతనంతో కూడిన వెటర్నరీ సెలవులు ఇచ్చి, విధి నిర్వహణలో చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియాతో పాటు, వారి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించి, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేశ్ పాల్గొన్నారు.



మద్దతు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

**ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి**

**పాతమంచిర్యాల:** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నుంచి సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక దీక్ష శిబిరాన్ని ఏఐటీయూసీ నాయకులతో కలిసి సందర్శించి మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, నాయకులు మిట్టపల్లి పోలు ఉన్నారు.

# ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**రామకృష్ణాపూర్:** ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులోపడి నష్టపోకుండా జాగ్రత్తగా ఉండాలని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గురుకుల బాలికల పాఠశాలలో గురువారం విద్యార్థినులకు ఉమెన్‌సేఫ్టీ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ తాత్కాలిక ఆనందాల కోసం ప్రలోభాలకు గురై భవిష్యత్‌ను నాశనం చేసుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మందమర్రి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ మోసాలు, ఉమెన్‌సెఫ్టీ, ట్రాఫిక్ రూల్స్ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎలాంటి వేధింపులకులోనైనా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ టీంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా సమాజంలో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని వివరించారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. మందమర్రి ఎస్సై చంద్రకుమార్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ

# అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు

**దండేపల్లి:** మీసేవ కేంద్రాల్లో వివిధ ధ్రువీకరణ పత్రాలకు అధిక రుసుము వసూళ్లు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మీసేవా కేంద్రాల నిర్వాహకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ధ్రువ పత్రాలకు సంబంధించిన హార్డ్ కాపీలను తహసీల్ కార్యాలయంలో అందించాలని, ఓటరు గుర్తింపు కార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే దానికి సంబంధించిన దరఖాస్తును తహసీల్ కార్యాలయంలో అందించాలన్నారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**భీమిని:** బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి, కన్నెపల్లి, ముత్తాపూర్, ఆనందాపూర్ గ్రామాల్లో సుమారు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం కన్నెపల్లి రైతు వేదికలో జజ్జరవెల్లి గ్రామంలో 20 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ స్థల పత్రాలను అందజేశారు. ఆనందాపూర్ గ్రామంలోని రైతులకు పంట భూములు ఉన్నప్పటికీ వాటికి పట్టాలు లేవని అవి వచ్చేలా చూడాలని రైతులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్‌కు రైతులు, భూముల వివరాలను సేకరించి అందజేయాలన్నారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు పేర్కొనడంతో వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసి త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఏసయ్యపల్లి నుంచి లింగాలకు, పోలంపల్లి నుంచి శిఖినంకు బీటి రోడ్లకు టెండర్ అయిందని వాటిని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. నాయకునిపేటలో సబ్‌స్టేషన్ ఏర్పాటుతో ఆ ప్రాంత వాసులకు కరెంట్ కష్టాలు తీరాయన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, బెల్లంపల్లి ఏఎంసీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, సర్పంచ్‌లు పుల్లూరి సురేఖ, లక్ష్మీ, అశోక్‌గౌడ్, ఎంపీటీసీలు భారతి, లతశ్రీ, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శ్రీరామరావు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరావు, తహసీల్దార్ దత్తుప్రసాద్‌రావు, ఎంపీడీఓ రాధాకిషన్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## బ్యాంకుల వద్ద బారులు..



మాఫీ డబ్బులు తీసుకుంటున్న రైతులు

**దండేపల్లి:** తెలంగాణ ప్రభుత్వం రైతులకు రూ.99వేల వరకు పంట రుణం మాఫీ చేసింది. దీంతో రైతులు బ్యాంకుల బాట పట్టారు. తమకు మాఫీ అయ్యిందో లేదో తెలుసుకుంటున్నారు. మాఫీ అయిన వారు డబ్బులు విత్‌డ్రా చేసుకుంటున్నారు. బ్యాంకులు రైతులతో కిటకిటలాడుతున్నాయి. దండేపల్లి గ్రామీణ బ్యాంకు గురువారం రైతులతో కిక్కిరిసి కనిపించింది.

## ఒక్కరోజులోనే సొంత గూటికి



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలోకి ఉపసర్పంచ్

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం చిన్నగోపాల్‌పూర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పెంద్రెం గోపాల్ బుధవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుని గురువారం తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు ప్రేమ్‌సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉప సర్పంచ్ పెంద్రెం గోపాల్ గురువారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలోకి రావడంతో పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, నాయకులు ఎదుల భూమన్న, బేర వెంకటేశ్, గట్టయ్య, విజిత్‌రావు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలి

**నస్పూర్:** పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఓసీ కమాన్ నుంచి ఇందారం క్రాస్ రోడ్డు వరకు పెండింగ్‌లోని జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి నయీం పాషా డిమాండ్ చేశారు. గురువారం ఆయన నాయకులతో కలిసి నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టణ పరిధిలోని తోళ్లవాగు నుంచి ఇందారం క్రాస్ రోడ్డు వరకు చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.59కోట్లు మంజూరు చేసిందన్నారు. కాంట్రాక్టర్ శ్రీరాంపూర్ ఓసీ కమాన్ నుంచి ఇందారం వరకు రోడ్డు మరమ్మతులకు అటవీశాఖ అనుమతులు తీసుకోకుండా పనులు చేపట్టారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అటవీశాఖ అనుమతులు తీసుకుని జాతీయ రహదారి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కె.రాజేందర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు, శ్రీనివాస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, సంతోష్ నస్పూర్ మండల కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నయీంపాషా

## పర్మినెంట్ చేయాలని వినతి

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న 365 మంది కాంట్రాక్టు కార్మికులందరిని తక్షణమే పర్మినెంట్ చేయాలని లేనిపక్షంలో ఈ నెల 18వ తేదీ నుంచి సమ్మె చేస్తామని గురువారం మంచిర్యాల జిల్లా మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కార్మికులు కీలకంగా పోషించారని, చాలీచాలని వేతనాలతో విధులను నిర్వర్తిస్తున్నారని, వారిని తక్షణమే పర్మినెంట్ చేసే ప్రభుత్వ జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ రెగ్యులర్ ఎంప్లాయిలకు ఇచ్చేలా వర్తింపజేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ వ్యక్తిగత సెలవులు వర్తింపజేసి, విధి నిర్వహణలో మరణించిన వారికి ప్రమాద బీమా వర్తింపు, సేఫ్టీ పరికరాలను అందించి, హెచ్ఆర్ పాలసీ ఇంక్రిమెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

**నస్పూర్:** నస్పూర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు కొయ్యల వెంకటి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కదిరి రాజు, కోశాధికారి జాక్రి అజీజ్, ఉపాధ్యక్షుడు సతీష్, రాజేశ్వర్, చందు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

## మహిళల రక్షణకు షీటీం

**మంచిర్యాలక్రైం:** మహిళలకు షీటీం రక్షణ కల్పిస్తోందని జిల్లా షీటీం ఇన్‌చార్జి ఎస్సై హైమా ఉన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో షీ టీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు భద్రత కల్పించడమే కర్తవ్యంగా షీటీం పనిచేస్తుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై, సైబర్ నేరాలు, చిన్న పిల్లలకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న మహిళలు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు ఈవ్ టీజింగ్‌కు గురైన, ఎవరైనా వేధింపులకు గురిచేసినా వెంటనే షీ టీమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసేందుకు షీ టీమ్ వాట్సాప్ నంబర్‌కు 6303923700 లేదా అత్యవసర సమయంలో 100డైల్‌కు గాని సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాల విద్యార్థులతో షీటీం పోలీసులు

## 20న మహాసభ విజయవంతం చేయండి

**కాసిపేట:** ఈ నెల 20న బెల్లంపల్లి వైష్ణవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే బెల్లంపల్లి బ్రాంచి మహాసభలు విజయవంతం చేయాలని బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య కోరారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై మహాసభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు తీర్మాణాలు చేసి భవిష్యత్ కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపెల్లి వెంకటస్వామి, జిల్లా నాయకులు హాజరు కానున్నారని తెలిపారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## క్లుప్తంగా

### వ్యాధులపై అవగాహన

**మంచిర్యాలఅర్బన్:** పాత మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో స్థానిక లయన్స్‌క్లబ్ గ్రీన్‌సిటీ ఆధ్వర్యంలో డాక్టర్ మహావీర్ గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిశుభ్రత, జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా హోమియోపతి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీజినల్ చైర్‌పర్సన్ డా.సుగుణాకర్ రెడ్డి, జోన్ చైర్‌పర్సన్ డేగబాపు, జిల్లా యూత్, స్పోర్ట్స్ చైర్‌పర్సన్ చంద్రమోహన్‌గౌడ్, క్లబ్ కోశాధికారి డా.నిశాంత్ పాల్గొన్నారు.

### నూతన నియామకం

**జన్నారం:** మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండలంలోని బాదంపెల్లికి చెందిన పాదం రాకేష్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గురువారం నియామక పత్రం అందించారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని రాకేష్ తెలిపారు.

**గ్రామ అధ్యక్షుడిగా సురేశ్**

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని కాచన్‌పల్లి గ్రామంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా గ్రామ అధ్యక్షుడిగా బడుగు సురేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా మండల అధ్యక్షుడు గోదరి రమేష్, సర్పంచ్ అక్కల రాజేశ్వరి, రాజయ్య, ఉప సర్పంచ్ రాదండి మల్లేష్, ఎంపీటీసీ బండం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

### లబ్ధిదారుల ఎంపికకు సర్వే

**భీమారం:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు గురువారం సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో కలిపి 1805 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

**సర్వే పకడ్బందీగా నిర్వహించాలి**

**జైపూర్:** మండల వ్యాప్తంగా చేపడుతున్న గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపికలో భాగంగా చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. మండలంలోని శివ్వారం, పౌనూర్, కిష్టాపూర్, బెజ్జాల, నర్సింగాపూర్, టేకుమట్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న గృహలక్ష్మి సర్వేను గురువారం ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో బాలయ్య పరిశీలించారు.

### ప్రవేశ గడువు పెంపు

**దండేపల్లి:** ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఈనెల 31వరకు గడువు పెంచినట్లు దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బొజ్జ శోభ గురువారం తెలిపారు. ఇప్పటికీ ఇంకా అడ్మిషన్ పొందని వారుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడవులోగా అడ్మిషన్ పొందాలని కోరారు.

### కొత్త ఇంటి నంబర్లను సవరించుకోవాలి

**తాండూర్:** మాదారం త్రీ ఇంక్‌లైన్ గ్రామపంచాయతీలో కొత్తగా సవరించిన ఇంటి నంబర్లను ఆధార్ కార్డులో ఇంటి యాజమానులు సవరించుకోవాలని మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పాత గ్రామపంచాయతీ నుంచి కొత్తగా ఏర్పడిన మాదారం త్రీ ఇంక్‌లైన్ గ్రామపంచాయతీలో 2020 సంవత్సరంలో ఇంటింటా సర్వే చేశామని తెలిపారు. ఆ సర్వేలో భాగంగా కొత్తగా కేటాయించిన ఇంటి నెంబర్లు మాత్రమే అమలులో ఉంటాయని తెలిపారు. ఆ ఇంటి నంబర్లను యాజమానులు ఆధార్ కార్డులో నవీకరించుకోవాలని సూచించారు. గ్రామస్తులు ఎలాంటి ఆందోళనలకు గురి కావద్దని తెలిపారు.

### నేడు ఉచిత వైద్యశిబిరం

**నెన్నెల:** బైబుల్ కమ్యూనిటీ చర్చ్ మంచిర్యాల ఫీల్డ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని దుబ్బపల్లి(ఎస్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫాస్టర్ స్టీవెన్ తెలిపారు.

### సమస్యలు పరిష్కరించాలి

**తాండూర్:** గోలేటి ఏరియా వర్క్‌షాపులో కార్మికుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం వర్క్‌షాపుకు వెళ్లి కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో జనరల్ మజ్దూర్, ఎలక్ట్రికల్ సూపర్ వైజర్, ఎలక్ట్రిషన్, మెకానికల్ చార్జ్‌హ్యాండ్‌ల కొరత ఉందని, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ శ్రేణులు తిరుపతి, మంతు, సమ్మయ్య, శ్రీనివాస్, కిరణ్, కుమారస్వామి, రాజేశం, నారాయణ పాల్గొన్నారు.

### అందని సేవలు

**మందమర్రిరూరల్:** మందమర్రి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ అందుబాటులో లేక ప్రజలకు అందాల్సిన సేవలు నిలిచిపోయాయి. ఈ నెల 23 వరకు తహసీల్దార్ చంద్రశేఖర్ ఎన్నికల శిక్షణ తరగతులకు వెళ్లారు. కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పోస్ట్ ఖాళీగా ఉండడంతో ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు సమయానికి అందక ఇబ్బంది పడుతున్నారు.

## సంక్షిప్త వార్తలు

**పదో తరగతి వరకు ఉచిత విద్య**

**మందమర్రిరూరల్:** మండలంలోని శంకర్‌పల్లికి చెందిన దర్నాల రమేష్ అతడి కుమారుడు సూర్యతేజ శ్రీరాంపూర్‌లోని జీఎం ఆఫీస్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో రమేష్ భార్య వెన్నెల తీవ్ర గాయాలతో ప్రాణప్రాయస్థితి నుంచి బయటపడింది. విషయం తెలుసుకున్న పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన హైదరాబాద్ కృష్ణవేణి స్కూల్ చైర్మన్ రాంవేణు ఐదో తరగతి చదువుతున్న రమేశ్ కూతురు సువీక్షను పదో తరగతి వరకు ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. గురువారం విద్యార్థినికి పుస్తకాలు అందించారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ**

**వేమనపల్లి:** నాగారాం గ్రామానికి చెందిన రజితకు గురువారం స్థానిక సర్పంచ్ తలండి స్వరూపారాణి రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ తలండి భీమన్న రూ.44 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. నాయకులు దొంతుల సత్యనారాయణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఆమరణ దీక్షకు మద్దతు**

**బెల్లంపల్లి:** నిర్మల్ మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ దీక్షకు గురువారం బెల్లంపల్లికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ సంఘీభావం తెలిపారు.

**అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి**

**లక్సెట్టిపేట:** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న ఒకేషనల్ కోర్సులోని సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ లలితకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

**విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ**

**లక్సెట్టిపేట:** మండలంలోని కొత్తూరు, మున్సిపాలిటీ పరిధిలోని శిశుమందిర్ పాఠశాలలోని విద్యార్థులకు రోటరీ క్లబ్ లక్సెట్టిపేట వారి ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ అందజేశారు. క్లబ్ ఫౌండర్ బాసెట్టి చంద్రగుప్త, అధ్యక్షులు వొజ్జల శ్రీనివాస్, కార్యదర్శి మనోహర్, కిషన్, గంగాదర్ ఉన్నారు.

**కుష్టువ్యాధిపై అవగాహన**

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామంలో గురువారం సర్పంచ్ కొట్టె మహేందర్ అధ్యక్షతన స్థానికులకు కుష్టువ్యాధిపై అవగాహన కలిపించారు. పారా మెడికల్ అధికారులు శివకుమార్, మాస్ మీడియా అధికారి బి.వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు సునీత, పద్మ పాల్గొన్నారు.

**ఆర్కే 6 గనిపై హెల్త్ క్యాంపు**

17ఎంసిఎల్281 హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న అధికారులు.

**నస్పూర్:** శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గని పై శ్రీరాంపూర్ ఏరియా వైద్య ఆరోగ్య విభాగం వైద్యులు గురువారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి ఉద్యోగులకు మధుమేహం, అధిక రక్తపోటు లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రక్తపోటు మధుమేహం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు వివరించారు. గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి ఆర్.రాంనర్సయ్య, పిట్ ఇంజినీర్ కుమార్, సర్వే అధికారి ఎస్‌పి వర్మ, ఇంజనీర్ మహేశ్ పాల్గొన్నారు.

**యువత మరింత ఉత్తేజంతో పని చేయాలి**

**జైపూర్:** గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జిలు, యువకులు మరింత ఉత్తేజంతో పనిచేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బల్మూరి అరవిందర్ రావు తెలిపారు. జైపూర్ మండలంలోని కాన్కూర్, మిట్టపల్లి, నర్వ, వెంట్రావుపల్లి, జైపూర్ గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జిలు, యూత్, విద్యార్థి విభాగాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుండు తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు గోదారి లక్ష్మణ్, ఆర్నే సమ్మయ్య, లక్ష్మణ్, దుట శేఖర్ పాల్గొన్నారు.

## మహాధర్నా విజయవంతం చేయండి

**వేమనపల్లి:** విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే తపస్ మహాధర్నాను విజయవంతం చేయాలని నీల్వాయి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో హెచ్ఎం సాంబశివరావు అన్నారు. అనంతరం ఆయన మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ వేమనపల్లి మండల అధ్యక్షుడు దుర్గం చందు, జిల్లా నాయకులు దాసరి మల్లేష్, బాపురావు, రాములు, రాజేందర్, నాగన్న పాల్గొన్నారు.